www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 17 డిసెంబర్ 2023

5

తిరుపతి



ఎయిర్ పోర్ట్‌లో శ్రీవాణి టికెట్స్ నిలిపివేత

నేరుగా బోర్డింగ్ పాస్‌తో తిరుమలలో పొందే అవకాశం

ప్రజాశక్తి- తిరుమల: రేణిగుంట విమానాశ్రయంలోని శ్రీవాణి (శ్రీ వెంకటేశ్వర ఆలయ నిర్మాణం) దర్శన టికెట్ కౌంటర్ మార్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం పేర్కొంది. డిసెంబరు 16వ తేదీ నుంచి తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో టికెట్ల జారీ చేయనున్నట్లు తెలిపింది. దేశ విదేశాల నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే విమాన ప్రయాణికుల సౌకర్యార్థం రేణిగుంట విమానాశ్రయంలో ప్రతి రోజు 100 ఆఫ్‌లైన్ శ్రీవాణి టికెట్లను టీటీడీ జారీ చేస్తోంది. విమానాశ్రయంలో శ్రీవాణి టికెట్ల జారీకి అనుమతి లేని కారణంగా డిసెంబరు 16వ తేదీ నుంచి విమానాశ్రయంకు బదులుగా తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో జారీ చేయనున్నారు. ప్రతిరోజు 100 టికెట్లను బోర్డింగ్ పాస్ సమర్పించిన భక్తులకు యధావిధిగా శ్రీవాణి దర్శన ఆఫ్‌లైన్ టికెట్లను ఇవ్వడం జరుగుతుందని టీటీడీ ఓ ప్రకటనలో పేర్కొంది. భక్తులు విమానాశ్రయంలో శ్రీవాణి దర్శన టికెట్ కౌంటర్ మార్పును గమనించాలన్నారు.

తిరుపతిలో..

పట్టువిడువక.. పిడికిలై...

భిక్షాటన, కళ్లకు నల్లరిబ్బన్లతో నిరసనలు - అంగన్వాడీలతో చెలగాటం వద్దు : ప్రభుత్వానికి సిఐటియు హెచ్చరిక

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: రాష్ట్రంలో అంగన్వాడీల జీవితాలతో చెలగాటమాడొద్దని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తిరుపతి మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన దీక్షలను ఉద్దేశించి శనివారం నాటి ఉదయం కందారపు మురళి ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అంగన్వాడీల పట్ల వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా విమర్శించారు. మొదటి రోజున చీఫ్ సెక్రటరీ చర్చలలో ఏం మాట్లాడారో... నాలుగవ రోజున కూడా మంత్రుల బందం, చీఫ్ సెక్రటరీ కలిసి అదే మాటలు మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఏదో ఒరగ బెడుతున్నట్టు నాటకమాడుతూ... ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి చర్చలు పేరుతో డ్రామాలాడుతున్నారని వేతనాలు పెంచకుండా, గ్రాట్యుటీని ఇవ్వకుండా... ఇతర ఆర్థిక ప్రయోజనాలు ఏమీ కల్పించకుండా సమ్మెను నిలిపివేయమని పదేపదే చెప్పడం... సమ్మెను విచ్ఛిన్నం చేయటానికేనని ఆరోపించారు. పోలీసులను, సచివాలయ సిబ్బందిని, వాలంటీర్లను వినియోగించి అంగన్వాడీ కేంద్రాలను నడపాలనుకోవడం అత్యంత దారుణమైన చర్యగా ఆయన అభివర్ణించారు. అంగన్వాడీలు కోరుతున్న డిమాండ్లు న్యాయమైనవని గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అంగన్వాడీలు ప్రశ్నిస్తూ.. వీధుల్లోకి వచ్చారనే విషయాన్ని గుర్తు చేశారు. అంగన్వాడీలకు తెలంగాణలో కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కావడం లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడి అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమాల హోరు పెరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికానికి పరాకాష్టగా ఉందని, ఈధోరణి మానుకోకపోతే వైసీపీకి ప్రజలు గుణపాఠం నేర్పిస్తారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జనసేన నేతలు రాజారెడ్డి, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు బాలసుబ్రమణ్యం, నగేష్, రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, టి. సుబ్రమణ్యం, వేణు, మునిరాజా, ఆర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

శ్రీకాళహస్తి: టీడీపీ అధికారంలోకి వస్తే శ్రీకాళహస్తి నియోజక వర్గం పరిధిలో పని చేసే ప్రతి అంగన్వాడీ కార్యకర్తకూ ఇంటి నిర్మాణం కోసం రెండు సెంట్లు భూమి ఇస్తామని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరసన కార్యక్రమం శనివారం నాటికి ఐదవ రోజుకు చేరింది. ఈ నిరసన కార్యక్రమానికి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సంఘీభావం తెలియచేశారు. నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలియచేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించుకుండా అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు పగుల గొట్టి సచివాలయ ఉద్యోగులచే కేంద్రాలు నిర్వహించడం ఎంతవరకు న్యాయమని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రశ్నించారు. శ్రీకాళహస్తిలో అంగన్వాడీలు ఆందోళన కొనసాగించే అన్నిరోజులూ తానే భోజన వసతి కల్పిస్తామన్నారు. తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ కూడా అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. టీడీపీ నేతలు దశరథాచారి, రంగినేని చెంచయ్య నాయుడు, విజయకుమార్, చక్రాల ఉష, సిఐటియు నేతలు అంగేరి పుల్లయ్య, పెరగడం గురవయ్య, గంధం మణి, రాజా, వెంకటేష్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్: గూడూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి 5వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు సమ్మె శిబిరం నుంచి పాత బస్టాండ్, టవర్ క్లాక్ సెంటర్, గాంధీ మున్సిపాలిటీ బిల్డింగ్, ముత్యాల పేట, రాజా వీధి, బజార్ వీధి, గాంధీ బొమ్మ, హాస్పిటల్ రోడ్ వీదుల మీదుగా పుర వీధుల్లో బిక్షాటన చేస్తూ ప్రభుత్వం మొండి వైఖరిని ప్రజలకు తెలియజేస్తూ నిరసన తెలిపారు. అనంతరం గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరిమళ వెంకటేశ్వరరావు, గూడూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నేదూరు శ్రీనివాసచారి, శిబిరం వద్దకు చేరుకొని సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు తమ పూర్తి మద్దతు తెలిపారు. అలాగే ఆశా వర్కర్ల జిల్లా ఉపాధ్యక్షురాలు కె.ఉష, జిల్లా కమిటీ సభ్యులు, కె.జానకి, ఎస్‌కె.రజియా, పి.గున్నమ్మ, ఇ.హేమ అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపారు. లీడర్లు ఈ.పెంచలమ్మ, కుమారి, మంగమ్మ, సుబ్బమ్మ, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు అధ్యక్షులు బివి.రమణయ్య, కార్యదర్శి ఎస్.సురేష్, మున్సిపల్ జిల్లాకార్మిక సంఘం కార్యదర్శి బి.గోపీనాథ్, ఏ.ప్రసాద్, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 5 రోజూ కొనసాగింది. సిపిఎం నాయకులు రమణయ్య, బాల గురువయ్య సమ్మె శిబిరం చేరుకుని వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీసభ్యులు శోభ, ప్రాజెక్టు కార్యదర్శి కె.సుదర్శన పాల్గొన్నారు.

వెంకటగిరి: అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు నల్లరిబ్బన్లు కళ్ళకు కట్టుకొని నిరసన తెలియజేశారు. వీరికి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు దందోలు మురళీకష్ణ, కార్మికులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు ఐలా భాస్కర్, సుబ్బరాయులు సంఘీభావాన్ని తెలియజేశారు. ఐసిడిఎస్ వెంకటగిరి ప్రాజెక్టు సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఎన్.స్వరూపారని, ఎ.మంజుల ఐఎఫ్‌టియు అధ్యక్ష కార్యదర్శులు మమ్ములాబేగం, వరలక్ష్మి, పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఐదు రోజులుగా సమ్మె కొనసాగుతూనే ఉంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం కూడా పట్టించుకోవడం లేదని శనివారం అంగన్వాడీలు కళ్ళకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. పుత్తూరు తహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా పెట్రోల్ బంక్ వరకు సిఐటియు ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, ఏఐటియుసి నాయకులు డి.మహేష్, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య మద్దతు తెలిపారు.

పిచ్చాటూరు: 5వ రోజూ సమ్మెను కొనసాగిస్తున్న అంగన్వాడీ వర్కర్లకు టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. శనివారం పిచ్చాటూరు ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు టిడిపి తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు సతీష్ నాయుడు, మండల అధ్యక్షులు తిరుమలరెడ్డి మద్దతు తెలిపారు. అంగన్వాడి వర్కర్ల సమ్మెకు వారి వంతు సాయంగా రూ.5000లు ఆర్థిక సాయం చేశారు.

గూడూరు రూరల్: ఐదు రోజులుగా అంగన్వాడీ వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని, సచివాలయ సిబ్బందితో అంగన్వాడీ కేంద్రాలను నిర్వహించడాన్నీ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు పంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం గూడూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేక్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస వేతనం ఇవ్వాలని అంగన్వాడీలు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పూలచంద్రశేఖర్, వేమయ్య భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, సిద్ధయ్య, మూర్తి పాల్గొన్నారు.

నారాయణవనం: అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలుగుదేశం జనసేన పార్టీ మండల అధ్యక్షులు పి.గిరిబాబు, సుమన్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ఐదవ రోజు సమ్మె కొనసాగించారు. వారికి మద్దతుగా జిల్లా టిడిపి అధికార ప్రతినిధి నగిరి భాస్కరన్, మండల క్లస్టర్ ఇన్చార్జి టి.షణ్ముగం, పి.వేలు రెడ్డి, ఎన్.పొన్నుస్వామి యాదవ్, పిపి.లక్ష్మణన్, శరవణ రెడ్డి, శ్రీనివాసులు, జనసేన మండలాధ్యక్షులు సుమన్, సముదాయం బూత్‌ఇన్చార్జి డి.ఆరుముగం పాల్గొన్నారు.

కోట: స్థానిక అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఐదవ రోజు అంగనవాడీల సమ్మె కొనసాగింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్షంలోనూ గొడుగులతో సమ్మెను కొనసాగించారు. యూనియన్ మండల అధ్యక్షురాలు పద్మ లీలమ్మ, సరోజిని మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు సాధనే లక్ష్యం సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

రేణిగుంట: ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ శనివారానికి 5వ రోజు నిరసన సమ్మె రేణిగుంట మంచినీళ్ళ గుంట పాత ఎమ్మార్వో ఆఫీస్ శిబిరం వద్ద కొనసాగింది. అంగన్వాడీ కార్యకర్తలు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని, చేతులెత్తి దండం పెట్టి 'గోవింద నామం స్మరణ చేస్తూ నిరసన తెలిపారు. జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జ్ వినూత, కోటా చంద్రబాబు, భాస్కర్ శిబిరం వద్దకు విచ్చేసి అంగన్వాడీ సమ్మెకు మద్దతు తెలిపారు.

సత్యవేడు: సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎం.రమేష్ ఐదవ రోజూ కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. జనసేన నాయకులు హేమంత్ బాష, బాలాజీ, జ్యోతీష్ అంగన్వాడీల సమ్మెలకు సంఘీభావం తెలిపారు. గ్రీన్ అంబాసిడర్ శేఖర్, మునిస్వామి, సుబ్రమణి, గోవిందయ్య, భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యదర్శి తిరుమలై రెడ్డి, డివైఎఫ్ఐ నాయకులు మురళి మద్దతు తెలిపారు.

శ్రీకాళహస్తిలో..

సూళ్లూరుపేటలో...

వెంకటగిరిలో..

గూడూరులో..

నారాయణవనంలో..

కోటలో..

పుత్తూరులో..

పిచ్చాటూరులో..

రేణిగుంటలో..

సత్యవేడులో..

ఆందోళనలతో అట్టుడికిన జిల్లా

ప్రభుత్వ తీరును నిరసిస్తూ రోడ్డెక్కిన కార్మికులు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి ఆధ్యాత్మిక జిల్లా. ఎప్పుడు గోవింద నామాలతో ప్రతిధ్వనిస్తుంటాయి. అలాంటి ప్రాంతంలో ప్రభుత్వ నిర్లక్ష్య దోరణికి వ్యతిరేకంగా కార్మికులు రెడ్డెక్కారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఒక పక్క అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టగా ఆశా వర్కర్లు సైతం కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ 36 గంటల నిరసనకు దిగారు. వరద బాధితులను ఆదుకోవాలని, రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ పలు రాజకీయ పార్టీలు కలెక్టరేట్‌ను ముట్టడించాయి. తమకు టైమ్ స్కేల్ ఇవ్వాలంటూ టిటిడి ఫారెస్టు కార్మికులు చేపట్టిన నిరసనదీక్ష సుమారు 1160 రోజులు దాటడం గమనార్హం.

ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ అమలు చేయాలని, ఇతర పెండింగ్ సమస్యలపై అంగన్‌వాడీలు అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించినా, ర్యాలీలు, నిరసనలు, ఆందోళనలు, వంటావార్పులు, ముట్టడి, వినతిపత్రాలు సమర్పణ వంటివి చేసిన ప్రభుత్వంలో చలనం లేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో సమ్మెబాట పట్టాల్సి వచ్చింది. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి ఇవ్వాలి. రిటైర్మెంట్ బెనిపిట్ 5లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి. హెల్పర్ల ప్రమోషన్‌లకు వయో పరిమితి 50 సంవత్సరాలు పెంచాలి, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలి. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి. వేతనంగా కూడిన మెడికల్ల లీవ్ సౌకర్యం కల్పించాలి. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలి. పెండింగ్‌లో ఉన్న టిఏ బిల్లులు వెంటనే ఇవ్వాలి. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, బీమా అమలు చేయాలి. లబ్దిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలి. ఆయిల్, కందిపప్పు కాంటిటీ పెంచాలి. సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి. మధ్యాహ్నం ఒంటిలోపు కేంద్రాలను విజిట్ చేయరాదు. సూపర్‌వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలనే డిమాండ్లతో వారు సమ్మెకు దిగారు. జిల్లాలో సైతం తిరుపతి కేంద్రంగా కార్పొరేషన్ కార్యాలయం వద్ద సమ్మెలో భాగంగా భారీస్థాయిలో నిరసన దీక్ష చేపట్టారు. దీనిపై సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం కార్మికులను బెదిరింపులకు దిగడం శోచనీయం. మరో పక్క ఆశా వర్కర్లు తమ సమస్యలపై ఈ నెల 14, 15 తేదిల్లో 36 గంటల పాటు వంటావార్పు, ధర్నాకు దిగారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఆశా వర్కర్లకు కనీసవేతనం చెల్లించాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలకు మార్పు చేయాలి. పనిభారాన్ని తగ్గించాలి, మొబైల్ వర్క్ శిక్షణ ఇవ్వాలి. రికార్డు ఆన్‌లైన్, ఒక వర్కే చెల్లించాలి. ఏ కారణంతో మరణించినా 10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలి, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ 5లక్షలు ఇవ్వాలి. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి. ప్రభుత్వ సెలువులు, మెడికల్ లీవు, వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్ అమలు చేయాలి. 62 సంవత్సరాలు రిటైర్మెంట్ జీవోను వర్తింప చేయాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలి. కోవిడ్ కాలంలో (2020 మార్చి నుంచి) మరణించిన ఆశాలకు 10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి, కుటుంబంలో అర్హులైన వారిని ఆశాలుగా తీసుకోవాలి. ఏఎన్ఎం హెల్త్ సెక్రటరీల నియామకాల్లో ఆశాలకు వెయిటేజిని ఇవ్వాలని ఆశా వర్కర్లు ఆందోళన చేపట్టిన విషయం విధితమే. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

తుపాన్, కరువు నష్టాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ఆందోళనకు దిగి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. దీనికి తోడు మూడు సంవత్సరాలుకు పైగా టిటిడి అటవీ కార్మికులు తమకు టైమ్ స్కేల్ ఇవ్వాలని, కార్మికుల పట్ల వివక్షత విడనాడి, అందర్ని ఒకే విధంగా చూసి, మిగిలిన 200 మంది కార్మికులను కూడా బోర్డు తీర్మానం మేరకు రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆందోళనను కొనసాగిస్తూనే ఉన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ, ఓటరు నమోదులో అక్రమాలు అనేక అంశాలపై గడిచిన నాలుగు రోజులుగా తిరుపతి జిల్లా కేంద్రం ఆందోళనలతో అట్టుడికుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిస్కరించాలని పలువురు కోరుతున్నారు. సమస్య వచ్చినప్పుడు పరిష్కరించాలే కాని, అధికారదర్పంతో జఠిలం చేయకుడదని హితవు పలికారు.

ఉత్సాహం.. ప్రోత్సాహం.. బాలోత్సవం

29 విభాగాల్లో పోటీలు..

5వేల మందికి పైగా హాజరు

ప్రజాశక్తి- తిరుపతి సిటి

పిల్లలను ప్రోత్సహించేందుకు, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించిన పిల్లల పండుగకు వేలాది మంది విద్యార్థులు ఉత్సాహం హజరయ్యారు. తిరుపతి పండిట్ జవహర్ లాల్‌నెహ్రు మున్సిపల్ హైస్కూల్ రోటరీక్లబ్ సౌజన్యంతో తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో పిల్లల పండుగ-2 శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి టిటిడి ఛైర్మన్, తిరుపతి ఎంఎల్‌ఏ భూమన కరుణాకర్‌రెడ్డి, కార్పొరేషన్ మేయర్ డాక్టరు శిరీషా ముఖ్యఅతిథులుగా హజరయ్యారు. చాచా నెహ్రు సభా వేదికపై ఈసందర్భంగా తిరుపతి బాలోత్సవం గౌరవధ్యక్షులు టెంకాయల దామోదరం అధ్యక్షతన జరిగిన సభనుద్దేశించి ఎంఎల్‌ఏ భూమన మాట్లాడుతూ పిల్లలను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో పిల్లలు ఆనందంగా పాల్గొని, విజేయులు కావాలని ఆకాంక్షించారు. తిరుపతి కార్పొరేషన్ మేయరు డాక్టరు శిరీషా మాట్లాడుతూ తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో గత ఏడాది కూడా పిల్లల పండగ నిర్వహించారని, ఈ ఏడాది దాని కంటే ఎక్కువ స్థాయిలో విద్యార్థుల హజరయ్యారన్నారు. ప్రస్తుత కాలంలో పిల్లలకు చదువులు, ర్యాంకులే ప్రాధాన్యతగా మారాయన్నారు. చదువులతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ పిల్లల పండుగలో విద్యార్థులు తమ సామార్థ్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజ్‌కుమార్ మాట్లాడుతూ నిర్వాహకులు ఇలాంటి కార్యక్రమాలు ఎంచుకోవడం అభినందనీయమని అన్నారు. కమిటీ సభ్యులందరూ అన్ని స్కూల్స్‌కు తిరిగి వారిలో ఈ పోటీలపై ఆసక్తిని పెంచారన్నారు. పోటీలు అన్నాక జయోపజయాలు సాధారణమని, వాటిని పక్కనపెట్టి మీలోని నైపుణ్యతకు పదుపుపెట్టాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం చాచా నెహ్రు వేదిక వద్ద చిత్రలేఖనం, గోపీకృష్ణ వేదికపై శాస్త్రీయ కళా ప్రదర్శనలు, గురుజాడ వేదికపై దేశభక్తి గీతాలాపన, అన్నమయ్య వేదికపై జానపద నృత్యప్రదర్శనలు, బళ్ళారి రాఘవ వేదికై ఏకపాత్రాభినయం వంటి వాటితో పాటు పలు వేదికల నుంచి అనేక పోటీలను నిర్వహించారు. 29 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు 100కు పైగా స్కూల్స్ నుంచి 5వేల మందికిపైగా విద్యార్థులు హజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం న్యాయమూర్తుల ఎదుట పారదర్శకంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రాంగాణం మొత్తం కిక్కిరిసిపోయింది. బాలోత్సవం అధ్యక్షులు నడ్డా నారాయణ, కార్యదర్శి మల్లారపు నాగార్జున, కార్పొరేటర్ గీత, ఎస్‌పిజెఎన్ఎంహెచ్ స్కూల్ హెచ్ఎం మునిశేఖర్, ఎంఈవోలు బాస్కర్ నాయక్, బాలాజీ, బండి మధుసూధనరెడ్డి, సుజాత, ముఖేష్, రెడ్డెప్ప విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూమనకు జ్ఞాపికను అందిస్తూ..

ప్రారంభోత్సవంలో జెండాను ఎగురవేస్తున్న ప్రముఖులు



ప్లాస్టిక్‌ను నియంత్రించాలని కోరుతూ బాలుడి వినూత్న ప్రదర్శన

ఒక వేదికపై వేలాదిమంది విద్యార్థులు

తిరుపతి(మంగళం): నేడు పోటీ ప్రపంచంలో విద్యార్థుల మానసిక ఎదుగుదల ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో పిల్లల్లో సహజ వికాసం, నూతన ఆలోచనలకు తిరుపతి బాలోత్సవం వేదికగా మారింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తమలో ఉన్న ఆలోచనలతో పాటుగా ఇతర విద్యార్థుల ఆలోచనలను పంచుకోవడానికి బాలోత్సవం దోహదపడుతోంది. వేలాది మంది విద్యార్థులు ఒక వేదికపై దాదాపు 29 రకాల పోటీలలో పాల్గొని వారి మానసిక వికాసానికి మరింత మెరుగైన ఆలోచనలు చేయడానికి అవకాశం ఏర్పడింది. బాలోత్సవం గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు "ప్రజాశక్తి"తో పంచుకున్న అనుభవాలు వారి మాటల్లోనే.....

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి

- సోమేశ్వర్ బండ్ల, సంకల్ప హాస్పిటల్ డైరెక్టర్



నేడు టెక్నాలజీతో కూడుకున్న విద్యను అభ్యసించడానికి చాలావరకు సెల్ ఫోన్స్ వినియోగిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన మేరకు తప్ప సెల్‌ఫోన్ వినియోగం చేయకుండా తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలి. బాలోత్సవం కార్యక్రమానికి తమ వంతుగా సంకల్ప హాస్పిటల్ వైద్య సేవలను అందుబాటులో ఉంచాం.

నీతి పద్యాలకు సమయం ఉండేది

- నడ్డి నారాయణ, బాలోత్సవం అధ్యక్షులు

గతంలో విద్యార్థులకు మానవీయ విలువలు పెంపొందడానికి ఉపాధ్యాయులు నీతి పద్యాలు చెప్పడానికి ఒక సమయాన్ని ఏర్పాటు చేసేవారు. కాలానుగుణంగా టెక్నాలజీ పుణ్యమా అని బాలల్లో వికాసం గాడి తప్పుతోంది. వాటి నుంచి పిల్లల్లో మానవీయ విలువలు, నీతి అలవర్చుకునేలా బాలోత్సవం ప్రయత్నం మొదలు పెట్టింది.

కొత్త ఆలోచనలకు వేదిక

- బండి మధుసూదన్ రెడ్డి, యుటిఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి.

పిల్లల్లో కొత్త ఆలోచనలకు వేదికగా బాలోత్సవం ఉపకరిస్తుంది. ఒకే వేదికపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కలుస్తున్నారు. ఇది సమానత్వానికి, విద్యార్థుల మధ్య అంతర భయాన్ని పోగొడుతుంది. ఒకరి ఆలోచనలు మరొకరు నేర్చుకోవడానికి బాలోత్సవం అవకాశం కల్పిస్తోంది.

టెక్నాలజీతో కూడిన బోధన

- వై.హేమాద్రి బాబు, యుటిఎఫ్ తిరుపతి నగర అధ్యక్షులు

రాష్ట్ర ప్రభుత్వం బాల్య దశ నుండి నూతన టెక్నాలజీతో విద్యాబోధన చేయాలని, వాటికి తగిన సదుపాయాలను పాఠశాలలు ఏర్పాటు చేయడం హర్షించదగింది. కరోనా తరువాత విద్యార్థులు టెక్నాలజీలో ఒక అడుగు ముందుగానే ఉన్నారనే చెప్పాలి. వారి ఆలోచనలు వేగంగా మారాయి.

నేడు క్రీడల పట్ల ఆసక్తి చూపట్లేదు

- పి.విజయ కుమారి, స్కూల్ గేమ్స్ తిరుపతి జిల్లా కార్యదర్శి

నేటితరం విద్యార్థులు కాలానుగుణంగా కనుమరుగవుతున్న క్రీడల పట్ల ఆసక్తి చూపట్లేదు, వాటిని పూర్తిగా మరిచిపోతుండగా బాలోత్సవం వాటిని తిరిగి పిల్లల ముందు ప్రదర్శించడం జరుగుతుంది. సాధారణ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, కొన్ని క్రీడలు బాల్య దశ నుండి ఉన్నత లక్ష్యాలకు చేరుకునేలా చేస్తుంది. వాటిని బాలోత్సవం ద్వారా పిల్లలకు పరిచయం చేస్తున్నాం. బాలోత్సవంతో మనోవికాసంతో పాటు క్రీడా వికాసం ఏర్పడుతొంది.

బాలోత్సవం చాలా బాగుంది

- బి.జాహ్నవి, 5వ తరగతి, ఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్

నేను బాలోత్సవంకు రావడం చాలా సంతోషంగా ఉంది. చాలా పాఠశాలల నుండి విద్యార్థులు కలుసుకున్నాం. మా పాఠశాలలో లేని స్పెల్ బి పోటీలలో పాల్గొన్నాను. బాలోత్సవం నిర్వహించిన పోటీల్లో నేను నెమలి బొమ్మను గీసాను.

వినోదంతో పాటు విజ్ఞానం

- కె. స్రవంతి, విద్యార్థిని తల్లి, కొర్లగుంట, తిరుపతి

బాలోత్సవం ద్వారా పిల్లల్లో వినోదంతో పాటు విజ్ఞానం పొందే అవకాశం వచ్చింది. రెండు రోజులపాటు వారి మోత బరువుకు రిలాక్సేషన్ దొరికింది. బాలోత్సవం ద్వారా మనోవికాసంగా పిల్లలు ఎదుగుతారు. ఒక విద్యార్థిని తల్లిగా చెబుతున్న చాలా బాగుంది. ఒకే వేదికపై పలురకాల టాలెంట్లు చూడగలిగే అవకాశం కలిగింది.

తెలుగు భాషను కాపాడడానికి

- నెమిలేటి కిట్టన్న, తెలుగు ఉపాధ్యాయులు, మంగళం ట్రెండ్స్ పాఠశాల

నేడు తెలుగు వింపడకూడదు, కనపడకూడదు అన్నట్లుంది పరిస్థితి. అయినా తెలుగు భాషను బతికించుకోవడానికి, అనేక సంస్థలు పుట్టుకొచ్చాయి. అందులో భాగంగా 'తిరుపతి బాలోత్సవం' సంస్థ ఏర్పడి పిల్లల్లోని సజనత్మాకతను వెలికి తీసి, ఎప్పుడు మార్కులు, ర్యాంకులేనా కూసింతైనా అటవీడుపు అందులోనువారి వారిలోని సజనను వెలికి తీయడానికి ఇది ఒక సదవకాశం. స్మార్ట్ ఫోన్లో పిల్లల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతున్న వేళ ఈబాలోత్సవం పిల్లల మానసిక వికాసానికి, మూర్తిమత్వం నిర్మాణానికి ఎంతగానో తోడ్పాటునందించింది.

దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-క్యాంపస్: సైనిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 86888 88802, 9399976999 సంప్రదించాలన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: తిరుపతిలోని జగన్నాథ చర్చి ఆవరణలోని వృద్ధాశ్రమానికి తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి.మునిస్వామి నాయుడు ఆధ్వర్యంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. శనివారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని వృద్ధులకు నిత్యావసర సరుకులు, ఆరోగ్య సంరక్షణ కొరకు మందులు, అదేవిధంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ముబారక్ బాషా, పద్మనాభన్, సోమయ్య, వికాస్ పాల్గొన్నారు.

మురుగునీరు తొలగింపు

ప్రజాశక్తి-వెంకటగిరి: కాలువలో పేరుకుపోయిన మురుగునీటిని కౌన్సిలర్ శనివారం తొలగించారు. శనివారం వెంకటగిరి పట్టణంలోని 16వ వార్డులో కౌన్సిలర్ రాధమ్మ పర్యటించారు. రోడ్డు ఆక్రమణకు గురై పేరుకుపోయిన మురుగునీటిని తొలగించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం సమీపంలో రూ.లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, కార్మికులు ఉన్నారు.

మహిళలకు ఆటోలు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉన్నతి పథకం ద్వారా లబ్ధిదారులకు అధికారులు ఆటోలు పంపిణీ చేశారు. మండలంలోని చిగురుపల్లి గ్రామానికి చెందిన వెన్నెల, కాటూరుకు చెందిన మాణిక్యం నాగమణిలకు శనివారం ఆటోలు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు బ్యాంకు సహకారంతో రుణ సదుపాయం కల్పించి పథకం వర్తింపజేసినట్లు ఏపీఎం ఇందిర తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ భార్గవి అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా వివరించారు.

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: రాయితీపై ప్రభుత్వం మంజూరు చేసిన విత్తనాలను ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. మిచౌంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం 80శాతం రాయితీతో విత్తనాలు అందజేస్తున్నట్లు ఏవో జ్యోతిర్మయి వివరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్‌రెడ్డి, తహశీల్దార్ గోపిరెడ్డి, ఎంపీడీవో రఘురామయ్య, హౌసింగ్ ఏఈ మోహన్, ఎంఈఓ కృష్ణయ్య ఉన్నారు.

తుపాన్ బాధితులకు నగదు

ప్రజాశక్తి-కోట: మండలంలోని కర్లపూడి పంచాయతీలో తుపాన్ వలన నష్టపోయిన బాధితులకు కర్లపూడి సర్పంచ్ ఆధ్వర్యంలో బాధితులకు నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెంచురామయ్యరెడ్డి, సిబ్బంది, పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్ దూరం

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ప్రతి ఒక్కరికీ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన అవసరమని రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వర్షిల పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ షర్మిల, లెక్చరర్ బాలాజి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో ముగిసిన మూడు రోజుల వర్క్‌షాప్

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ప్రొఫెసర్లు సిద్ధార్థ, మూర్తి, అరుణ, శైలేశ్వరి, మాధవి, సి.హెచ్. బేబిప్రసూన పాల్గొన్నారు.

ఆసక్తితో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-కోట: విద్యార్థులు ఆసక్తితో అభ్యసించాలని ఎంఈవో మస్తానయ్య అన్నారు. శనివారం మండలంలోని గూడలి పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు.

ఉమ్మడి పోరుకు సిద్ధం కండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జనసేన-టీడీపీ కూటమికి ప్రజలు అండగా నిలబడాలని జనసేన నేత వినుత కోటా విజ్ఞప్తి చేశారు. 'జనసేన విజయ యాత్ర- ఏపీ నీడ్స్ పవన్ కళ్యాణ్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె తొట్టంబేడు మండలం పెన్నలపాడు పంచాయతీలో పర్యటించారు. వినుత కోటా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే అవినీతికి పాల్పడుతున్నారంటూ ప్రజలకు వివరించారు. పేట చంద్రశేఖర్, శివకుమార్, దండి రాఘవయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణంలో టీడీపీ నాయకులు శనివారం బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టబోయే పథకాలను వివరించారు. మినీమేనిఫెస్టో సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరుణాకరన్, జీవరత్నంనాయుడు, ధనపాల్, బాలాజీ, అన్బు, సోము, ప్రకాష్, కుమార్ వేలు, అన్నామలై, కన్నన్, మోహన్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపింది జగనే : మోహిత్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: పేదల జీవితాల్లో వెలుగులు నింపింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తుడా ఛైర్మన్, వైసీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దేవరకొండ, చిట్టేచర్ల, దీందార్లపల్లి, భాకరాపేట పంచాయతీలల్లో పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. మండలంలో "ఏపీకి జగనే ఎందుకు కావాలి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. మరోసారి జగన్‌ని గెలిపించుకోవడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ సహదేవరెడ్డి, సర్పంచ్ భూపాల్, నాయకులు గురుశంకర్, కొండారెడ్డి, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్: తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురం పంచాయతీలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ రెండవ రోజు గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాపులర్ షూ మార్టు నూతన బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన పాపులర్ షూ మార్టు నూతన బ్రాంచిని టిడిపి నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి (పెద్దబ్బ) ప్రారంభించారు. స్థానిక ఎయిర్ బైపాస్‌రోడ్డులోని డీమార్టు సమీపంలోని మాయా బజారు ఎదురుగా ఏర్పాటు చేసిన బ్రాంచి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాపులర్ షూ మార్టు తిరుపతిలో రెండో బ్రాంచిని ఏర్పాటు చేయడం అబినందనీయమన్నారు. మన్నిక గల నాణ్యమైన పాదరక్షలు అందిస్తూ పాపులర్ షూమార్టు యాజమాన్యం వినియోగదారులు మన్నలను పొందిందని తెలిపారు. కొత్త షోరూమ్‌ను కూడా వినియోగదారులు అదరించాలని కోరారు. ఆ సంస్థ అదినేత చుక్కలపల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 1962లో పాపులర్ షూ మార్టు వ్యవస్థాపకులు చుక్కలపల్లి పిచ్చయ్య దీన్ని ప్రారంభించారు. ఈ సంస్థ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాల్లో విస్తరించిందన్నారు. దేశ వ్యాప్తంగా 157 షో రూమ్‌లతో ప్రస్తుతం వినియోగదారులకు అందుబాటులో ఉందన్నారు. దక్షణ బారత దేశంలోనే డైమండ్ జూబ్లీ జరుపుకుంటున్న ఏకైక పుట్‌వేర్ సంస్థ పాపులర్ షూమార్టు అని తెలిపారు. తిరుపతిలోని బ్రాంచిల్లో మహిళలకు, వృద్దులకు, పురుషులకు, పిల్లలకు అన్ని వయస్సుల వారికి నచ్చిన, మెచ్చే అధునూతన పాదరక్షకులు అందుబాటులో ఉంచామన్నారు. మహిళలకు ప్రత్యేకంగా సరికొత్త డిజైన్లను ఏర్పాటు చేశామని, 1250 డైజన్లను అందుబాటులో ఉంచామని, మా సంస్థలతో రూ.200ల నుంచి రూ.7500ల వరకు చెప్పలు అందుబాటులో ఉన్నాయన్నారు. నూతన బ్రాంచి ప్రారంభం సందర్భంగా కొత్త బ్రాంచిలో శని, ఆదివారాల్లో కొనుగోలు చేసిన ప్రతి వస్తువుపై 10శాతం డిస్కౌంట్ అందిస్తామన్నారు. వినియోగదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో చుక్కపల్లి రాకేస్, అవినాష్, ఉన్నం మహేష్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి సాబ్జీకి నివాళి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అంగన్వాడీ ఉద్యమానికి మద్దతు ప్రకటించడానికి వస్తూ, మార్గమధ్యంలో ప్రమాదానికి గురై మరణించిన షేక్ సాబ్జికి తిరుపతిలో అంగన్వాడీ కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. షేక్ సాబ్జి ఉపాధ్యాయ ఉద్యమానికి, కార్మికోద్యమానికి అందించిన సహకారం మరువలేనిదని, ఆయన మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి నష్టమని నేతలు ప్రస్తావించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

తిరుపతి టౌన్: రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఎమ్మెల్సీ షేక్ షాబ్జీకి డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర, జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, యూనివర్సిటీ నాయకుడు నాగం వెంకటేష్, విద్యార్థులు ఘన నివాళులు అర్పించారు.

వరదయ్యపాలెం: శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అకాల మతిపట్ల మండల యుటిఎఫ్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం ఉపాధ్యాయలోకానికి తీరని లోటు అని అన్నారు. శనివారం స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు శశికుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్ భగవాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటగిరి: అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపి మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కామ్రేడ్ షేక్‌సాబ్జీ చిత్రపటానికి అంగన్వాడీలు పూలమాలవేసి నివాళులు అర్పించారు.

రేణిగుంట: అంగన్వాడీలు పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జి మృతికి సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు..

సత్యవేడు: అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు శాంతి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

శ్రీకాళహస్తి: ఉమ్మడి గోదావరి జిల్లాల పిడిఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతి ఉద్యోగ, కార్మిక లోకానికి తీరని లోటని సిఐటియు నాయకులు అన్నా రు. స్థానిక ఈ కాళహస్తి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగ న్వాడి కార్యకర్తలతో కలిసి శనివారం సిఐటియు నాయకులు సాబ్జి చిత్రపటానికి నివాళు లర్పించారు. పెనగడం గురవయ్య, చక్రాల ఉష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-రామచంద్రపురం: నేటి సమాజంలో విద్యార్థులు సత్ప్రవర్తన, సృజనాత్మకతను పెంపొందించుకుంటే బంగారు భవిష్యత్తును పొందగలరని ఎస్వీయూ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ విజయ భాస్కరరావు అన్నారు. శనివారం వెంకట్రామాపురం గ్రామంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కాలేజ్ నందు పట్టభద్రుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ విజయభాస్కరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి పోటీ సమాజంలో ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యతను పెంపొందించుకునేందుకు కృషి చేయాలని పిలు పునిచ్చారు. విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన డాక్టర్ రాజేష్ దంపతులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆలయ మాజీ ఛైర్మన్ పోతుగుంట గురవయ్య తనయుడు డాక్టర్ రాజేష్‌నాయుడు శనివారం టీడీపీ అధినేత చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేష్ నాయులు అధినేతను కలవడంపై స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే టికెట్‌పై రాజేష్‌నాయులు ఆశిస్తుండగా శనివారం అధినేతను కలవడంతో రాజకీయ వర్గాలతో మరింత చర్చకు దారితీసింది. ఇప్పటికే శ్రీకాళహస్తి స్థానంపై ఎస్సీవీ నాయుడు, బొజ్జల సుధీర్‌రెడ్డి ఉండగా రాజేష్‌నాయులు పేరు తెరమీదకు రావడం గమనార్హం.

సమస్యలు పరిష్కరించకుంటే

సమ్మెకు దిగుతాం : పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-గూడూరుటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు శనివారం ఏ.పీ.మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో గూడూరు మున్సిపల్ కమిషనర్ యం.వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి పురపాలక సంఘంలో పనిచేసే కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, ఇంజనీరింగ్ కార్మికులకు డ్రైవర్లకు రూ.18,500 జీతం తదితర డిమాండ్ పరిష్కారం కొరకై డిసెంబర్ 11 12 ,13వ తేదీలలో నిరాహార దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు. ఇంకా సమస్యలు పరిష్కారం కాలేదని, డిసెంబర్ 21 తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని పలు డిమాండ్స్‌తో కూడిన సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.గోపీనాథ్, పట్టణ అధ్యక్షులు బి.రమేష్, కార్యదర్శి డి.కోటేశ్వరావు, పట్టణ శ్రామిక అధ్యక్షురాలు బి.ప్రభావతి, కార్యదర్శి ఎం.సంపూర్ణమ్మ, గూడూర్ డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్ సి.ఐ.టి.యు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, కార్యదర్శి యస్.సురేష్,ఏ ప్రసాద్, జిల్లా కమిటి సభ్యులు బి.పెంచల ప్రసాద్ (పి.పి),యు.కిషోర్,సుబ్బమ్మ, శ్రీ లక్ష్మి,పోలమ్మ,పెంచలమ్మ, పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల మీట్

ప్రజాశక్తి-రామచంద్రాపురం: ఎంపీపీ బ్రహ్మానందరెడి అధ్యక్షతన శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ప్రజా సమస్యలపై చర్చించేందుకు సుముఖత చూపకపోవడంతో మండల సర్వసభ సమావేశం తూతూ మంత్రంగా సాగింది. మండలంలోని గ్రామాలలో సమస్యలు ఫుల్.. నిధులు మాత్రం నీల్.. కావడంతో మండల మీటిలో ప్రజా సమస్యల చర్చ సాగలేదు.

స్విమ్స్‌లో కార్మిక సమస్యలు పరిష్కరించాలి

డైరెక్టర్‌కు సిఐటియు నేత కందారపు మురళి విజ్ఞప్తి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: స్విమ్స్ ఆసుపత్రి పరిధిలో విధులు నిర్వహిస్తున్న వందలాదిమంది కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం సక్రమంగా వ్యవహరించడం లేదని, వారి సమస్యలను సానుభూతితో పరిశీలించి పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వి.కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం స్విమ్స్ డైరెక్టర్‌ను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, స్విమ్స్ యూనియన్ నేతలు రవి, ముత్తు, సూరి, కోటయ్య తదితరులు కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం కందారపు మరళి మాట్లాడుతూ ప్రతిష్ట నార్జించిన స్విమ్స్‌లో 1993 నుంచి వార్డు బాయ్స్ పేరుతో కార్మికులు పనిచేస్తున్నారని సుమారు 30 ఏళ్లుగా పనిచేస్తున్న వారి జీవితాలు ఎదుగూ, బొదుగులేని విధంగా తయారయ్యాయని గుర్తు చేశారు. ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ, స్ట్రెచర్ బేరర్ తదితర పోస్టులు స్విమ్స్ ఆస్పత్రిలో లేకపోవడం విచారకరమని తెలిపారు. కార్మికులకు పనిభారం విపరీతంగా పెరిగిందని, పదిమంది చేయాల్సిన పనిని ఐదుగురిచే చేయిస్తున్నారని దీంతో తీవ్రమైన పని ఒత్తిడికి కార్మికులు గురవుతున్నారని డైరెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. లక్ష్మీ శ్రీనివాసా కార్పొరేషన్‌లోని కార్మికులకు మూడు శాతం జీతం పెంపుదల చేస్తామన్న నిర్ణయం ఆసుపత్రిలో అమలు కాలేదని గుర్తు చేశారు. కొందరికి గుర్తింపు కార్డులు ఇవ్వలేదని, 250 మంది కార్మికుల్ని కార్పొరేషన్‌లో కలపకుండా బయట ఉంచారని, కొందరు కార్మికుల్ని తొలగించారని, ఈ సమస్యలన్నింటిని డైరెక్టర్ పరిష్కరించాలని కోరారు. డైరెక్టర్ ఆర్‌వి.కుమార్ స్పందిస్తూ సమస్యలన్నీ చర్చిస్తామని, కార్మిక నేతలు, కార్మికులతో కలిసి కూర్చొని చర్చించి సానుకూల పరిష్కారాలు కనుగొంటామని కార్మిక నేతలకు హామీ ఇచ్చారు.

ఆశా కార్యకర్తల జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఆశా కార్యకర్తల జిల్లా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు జిల్లా నాయకురాలు ఆర్.లక్ష్మీ అధ్యక్షతన శనివారం జిల్లాలోని ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా ఎం.కవిత, ప్రధాన కార్యదర్శిగా పి.లక్ష్మీ, కోశాధికారిగా వి.సుజాతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు టి.మురళీ, పి.మునిరాజా, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'రవీంద్రభారతి స్కూల్' కి

జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక ఎక్షలెన్సీ అవార్డు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ప్రతి సంవత్సరం బ్రెయిన్ ఫీడ్ మేగజైన్ వారు దేశవ్యాప్తంగా విద్యారంగలో విశిష్ట సేవలను అందించే పాఠశాలలను ఎంపిక చేసి వారికి జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక ఎక్షలెన్సీ అవార్డులను ప్రధానం చేస్తారు. ఈ ఏడాది ఆ అవార్డుకు తిరుపతి నగరం కొర్లగుంటలోని రవీంద్రభారతి స్కూల్ ఎంపిక కావడం పట్ల ఆ స్కూల్ కరస్పాండెంట్ రవీంద్రనాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం 15వ తేదీన హైదరాబాద్ హైటెక్ సిటి ఎగ్జిబిషన్ హాల్-2 నందు నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో రవీంద్రభారతి స్కూల్ కరస్పాండెట్ రవీంద్రనాథరెడ్డి అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్కూల్‌కు ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డు రావడం తిరుపతికే గర్వకారణమని అన్నారు. ఈ అవార్డు తమ బాధ్యతను ఇంకా పెంచిందని అన్నారు. ఇంత గొప్ప అవార్డు రావడానికి కషి చేసిన ఉపాధ్యాయ బందానికి, సహకరించిన తల్లిదండ్రులకు, విద్యార్ధులకు హదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఫిబ్రవరి 4న తిరుపతి ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రానున్న ఫిబ్రవరి 4న ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రం వేదికగా తిరుపతి ఫిలిం ఫెస్టివల్ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపకులు పులగం రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు కార్యక్రమంలో భాగంగా చిత్రం నిర్మాణ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తా మన్నారు. స్థానికంగా నటన పట్ల ఆసక్తి ఉండి సినిమాలు, వెబ్ సిరీస్, లఘు చిత్రాలు చిత్రీకరించిన వారు తమ ఫిలింలను ఫిబ్రవరి ఒకటో తారీకు లోపు పంపించాలన్నారు. తిరుపతి ఫిలిం ఫెస్టివల్ కమిటీ పర్యవేక్షణలో తుది ఎంపిక జరిగి అవార్డు ప్రధానోత్సవం చేస్తామన్నారు. నెట్ ఫ్లిక్స్ ఇండియా భాగ స్వామ్యంతో నిర్వహించే ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి కళాబి మానులందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఫిలింలను పంపడానికి అసో సియేషన్ వెబ్ సైట్ ను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆనందరావు, జీవన, కిస్టోఫర్, మురళి మోహన్, దిలీప్, కామెడీ శాస్త్రి పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ అవినీతిపై విచారణ చేయాలి: మునికృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునానిర్మానంలో జరిగిన అవినీతిపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారితో విచారణ జరిపించాలని గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ ఆర్ సి మునికృష్ణ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి హాయంలో టిటిడి నుండి 28 లక్షలు నిధులు తీసుకొచ్చామని, ఆ నిధులతో ఆర్చి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు. కానీ ప్రభుత్వం మారడంతో ఆర్చి నిర్మాణం ఆగిపోయిందన్నారు. దేవాలయంలో ఏదేని మార్పులతో కూడిన నిర్మాణం చేయాలంటే ఖర్చు వివరాలు ముందుగానే లెక్కించి సంబంధిత దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉందన్నారు. దేవాలయం పునః నిర్మాణం మొదలైనప్పటి నుంచి విరాళాలతో పనులు జరుగుతున్నాయని, ఇందులోనే పెద్ద స్థాయిలో అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ఒక ఏడాది జాతర నిర్వహణకు రెండు కోట్ల రూపాయలు నిధులు ఖర్చు అయ్యాయని అధికార పార్టీ వారు చెబుతున్నారని, గతంలో టిడిపి హాయంలో నిర్వహించిన అమ్మవారి జాతరకు 10 నుంచి 15 లక్షల లోపు నిధులతోనే అంగరంగ వైభవంగా జాతరను జరిపించామన్నారు. మరి రెండు కోట్ల రూపాయల నిధులు ఎక్కడ ఖర్చు చేశారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవినీతి తంతుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అక్కిపల్లి మునికృష్ణ యాదవ్, కరాటే చంద్ర తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లతో నష్టపోయేది ప్రజలే: సుధారెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దొంగ ఓట్లతో నష్టపోయేది ప్రజలే అని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధా రెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఈనెల 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు దాదాపు పదివేలకు పైగా ఫామ్-6 లు వచ్చాయని, ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన బిఎల్ఓ లు వెరిఫికేషన్ చేస్తే ఆ చిరునామాల్లో కొత్తగా ఫామ్-6 అప్లికేషన్ పెట్టుకున్న ఓటర్లు లేరని తేలిందన్నారు. వెరిఫికేషన్ చేస్తున్న ప్రతిపక్ష పార్టీ బిఎల్ఓ లను బెదిరిస్తున్నారని, ముఖ్యంగా మహిళలని చూడకుండా దౌర్జన్యంగా బెదిరింపులకు పాల్పడడం సహించమన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే తెలంగాణలో బిఆర్ఎస్ ఓటమి తరువాత ఓటమి భయంతో ఇలా దొంగ ఓట్ల నమోదుకు తెరతీసారని ఆరోపించారు. ప్రత్యేకంగా గుర్తించిన పోలింగ్ బూత్ లలో మాత్రమే ఈ ఫామ్-6 వచ్చాయన్నారు. గతంలో 42 వేల దొంగ ఓట్లను గుర్తించామని, అధికారులకు ఫిర్యాదు తర్వాత దాదాపు 22 వేల దొంగ ఓట్లు జాబితా నుండి తొలగించాలన్నారు. కొంతమంది అధికారుల సహకారంతో దొంగ ఓట్ల తంతు నడుస్తోందన్నారు. జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల కానుందని, అంతవరకు ఫామ్-6 లు అప్లై చేస్తూనే ఉంటారన్నారు. అధికార పార్టీకి సంబంధించిన బిఎల్వోలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి ఓట్లు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకురాలు కొట్టాల సుధా, తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, తిరుపతి రూరల్ మండల మహిళా అధ్యక్షురాలు రామంజేరి మహేశ్వరి, మధు, జనార్దన్ చౌదరి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోమంటే ఆగ్రహించి పొమ్మన్నాడు

- తహశీల్దార్ తీరుపై తుపాను ముంపు బాధితుల అసహనం
- కార్యాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి-బాలయ్యపల్లి: "ముంచుకొచ్చిన తుపానుతో మా ఇళ్లు నీట మునిగాయి అయ్యా.. సర్వం కోల్పోయాం.. ఆదుకోండి ప్రభూ" అంటూ తహశీల్దార్‌ని ఆశ్రయించిన బాధితులకు చేదు అనుభవం ఎదురైంది. మండలంలోని నిడిగల్లు గిరిజనులు శనివారం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. సాయం చేసి ఆదుకోమ్మంటే ఆగ్రహించి బయటకు వెళ్లమన్నాడని బాధితులు అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ పరిహారం కోసం తహశీల్దార్‌కు చెప్పుకొందామని ఇంతదూరం వస్తే.. బయటకు వెళ్లమన్నాడని, వీఆర్‌వోతో మాట్లాడుకోపోండి అంటూ ఆగ్రహంగా మాట్లాడినట్లు తెలిపారు. శరణుకోరి వస్తే.. ఇలా మాట్లాడుతారా అయ్యా అంటూ కన్నీరుపెట్టుకున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి సాయం చేయాలని కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించరే.!

- సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించలేదంటూ అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖపరమైన విధివిధానాలను వివరించారు. విద్యుత్ శాఖ అధికారులపై ప్రజాప్రతినిధులు నిలదీయడంతో వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు బదులి చ్చారు. కట్టువారిపల్లి, పొర్లగుట్ట తెగిపోయి ఏదని లేవనెత్తడంతో ఇప్పటికే మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ వివరణ ఇచ్చారు. తుపాను బాధితులకు ప్రభుత్వ సాయం అందజేసినట్లు తహశీల్దార్ గోపిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపా ధ్యాక్షులు గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో రఘురా మయ్య, ఏఎస్ఐ విజయ్‌కుమార్, ఏపీఎం పద్మావతి, ప్రజాప్రతినిధులు, అధికారలు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించాలి

ప్రజాశక్తి-సత్యవేడు: పంచాయతీల్లో ఇంటి పన్నుల లక్ష్యాన్ని ఫిబ్రవరి నాటికి వందశాతం పూర్తి కావాలని డీఎల్‌పీవో రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో పలు అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ నగదురహితంగా ఇంటి పన్నులు వసూలు చేయడానికి ఇప్పటికే స్కానర్సు, మిషన్లను పంపిణీ చేశామన్నారు. డిసెంబర్ చివరి నాటికి 30 శాతం, జనవరి 30 నాటికి 60 శాతం, ఫిబ్రవరి చివరినాటికి 100 శాతం ఇంటి పన్నులను వసూలు చేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప పథకంలో భాగంగా పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. చెత్తను సేకరించి బృందావనంకు తరలిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు సర్దుబాటు చేయాలన్నారు. సాంకేతిక సమస్యల వల్ల గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లింపులో జాప్యం నెలకొంటున్నట్లు ఆయన చెప్పారు. చెత్త నుంచి సంపదను సృష్టించే ప్రక్రియకు అవసరమైన చర్యలను తీసుకుంటామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో 15 రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్తో క్లోరినేషన్ చేయించి కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. దోమల నివారణకు మలాథిన్ మందును స్ప్రే చేయడంతో పాటు మురుగు నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్స్ బాల్స్ను విడిచి పెట్టాలన్నారు. అలాగే తాగునీటి పైపులు దెబ్బతింటే వెంటనే మరమ్మతు సురక్షిత తాగునీటిన సరఫరా చేయడానికి ప్రతి పంచాయతీ సెక్రెటరీ చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో సత్యవేడు పంచాయతీ సెక్రెటరీ మునిరవికుమార్, ప్రకాష్, మాధవి, రజిత, సునీల్‌కుమార్, జలజశ్రీ పాల్గొన్నారు.

పోలీసులపై ఎమ్మెల్యే అసహనం

- ఆకతాయిలపై కేసు ఎందుకు పెట్టలేదంటూ మండిపాటు
- కళాశాలలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు ధ్వంసం కావడం పట్ల ఆగ్రహం

ప్రజాశక్తి-పిచ్చాటూరు: ఆకతాయిలు చేస్తున్న ఆగడాలపై ఎందుకు కేసు పెట్టలేదంటూ ఎమ్మెల్యే ఆదిమూలం పిచ్చాటూరు పోలీసులపై ఫైర్ అయ్యారు. శనివారం ఆయన పిచ్చాటూరు మండలంలో పర్యటించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను ఆకతాయిలు ధ్వంసం చేసినట్లు అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 8న పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోయినట్లు వివరించారు. అక్కడే ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఆ తరువాత ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి కేసు ఎందుకు నమోదు చేయలేదంటూ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి సమయాల్లో గస్తీ పెంచాలని, ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా కళాశాల ఆవరణను శుభ్రం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులకు సూచించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, కళాశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీధర్‌ను ఆదేశించారు.

కళోత్సవాన్ని విజయవంతం చేయండి: సుబ్బరాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సుబ్బరాజు నాట్య కళా పరిషత్తు 60వ వార్షిక కళోత్సవాలను విజయవంతం చేయాలని పరిషత్తు అధ్యక్షులు కోనేటి సుబ్బరాజు పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుండి 22వ తేదీ వరకు తిరుపతి మహతి కళాక్షేత్రం వేదికగా జాతీయస్థాయి నాటిక, పద్య నాటిక, శాస్త్రీయ నృత్య, భగవద్గీత పట్టణ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 64 కళలు, 64 మంది నటీమణులకు, 64 మంది నటులు, హార్మోనిస్టులు, మేకప్ మేన్లను సత్కరిస్తున్నామన్నారు. వేగంగా కదులుతున్న కాలంతో ప్రయాణించే ప్రజలు కళాభిమానులు నిర్వహిస్తున్న పద్యనాటిక ప్రదర్శనకు వచ్చి మానసిక ఉల్లాసాన్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, హరినాథ్, చంద్రబాబు నాయుడు, కేశవుల రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్యాంకర్

ప్రజాశక్తి-ఏర్పేడు: ఆటోని ట్యాంకర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయాలపాలైన సంఘటన శనివారం మండలంలోని పల్లం వద్ద చోటుచేసుకుంది. రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన శంకర్ ఆటోలో వెంకటగిరికి వెళ్లి తిరుగొస్తుండగా పల్లం వద్ద ట్యాంకర్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శంకర్, అతని చెల్లెలు లక్ష్మీ, పిల్లలకు గాయాలయ్యాయి. వారికి స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

ఈతకెళ్లి యువకుడు మృతి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: స్నేహితులతో కలసి ఈతకు వెళ్లిన యువకుడు నీట ము నిగి మృతి చెందిన సంఘటన శనివారం మ ండలంలో దీవిపాలెం గ్రామపంచాయతీ సమీపంలో చోటుచేసుకుంది. గూడూరు రూ రల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ కథనం మేరకు.. ఊనుగుంటపాళెం గ్రామానికి చెందిన గుతి సుధీర్(20) ప్రేమ వివాహం చేసుకొని చిల్లకూరు గ్రామంలో అద్దెకు ఉంటున్నాడు. పెయింటింగ్ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం స్నేహితులతో కలసి గ్రామ సమీపంలో ఈతకు వెళ్లారు. సుధీర్ ఈత రాకపోవడంతో గట్టుపై నుంచి తన స్నేహితులు చూస్తున్నాడు. ప్రమాద వశాత్తు జారి నీటిలో పడి మునిగిపోయాడు. గుర్తించిన స్నేహితులు వెలికితీసి హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. సుధీర్ మృతి పట్ల కుటుంబీకులు కన్నీటిపర్యంతమైయ్యారు.

నీటి సరఫరాకి అంతరాయం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలకు సరఫరా అవుతున్న కళ్యాణి డ్యామ్ పైప్ లైన్ మరమ్మత్తుల కారణంగా సోమవారం నీటి సరఫరా వుండదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించ గలరని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

In the Court of the Senior Civil Judge : Gudur

O.S.No. 210 / 2012

1. Pajarla Kanthamma (Died) and others - Plaintiffs

Vs

1. Eddula Padmamma and others - Defendants

Notice to 11th Defendant

Eddulu Sai Karthik,
S/o Late **Viswanadh,** R/o Up stair of Servana Supermarket, Brahmin Street, Naidupeta town and Mandal, Tirupathi District.

పై నెంబరు కేసులో వాది మీ మీద పై వారి కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే05-01-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎ.వి.రాఘవరెడ్డి, బి.ఎ.ఎల్., బి.ఎల్.,
వాది తరపు న్యాయవాది, గూడూరు
సెల్: **94404 21733**